బాధిత చిన్నారులతో సున్నితంగా వ్యవహరించాలి

- నాలుగు గోడల ఆవల భద్రత ఉందనే భరోసానివ్వాలి
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లైంగిక వేధింపుల బాధిత చిన్నారుల పట్ల వ్యవస్థ మరింత సున్నితంగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. న్యాయం చేసే క్రమంలో పిల్లల మానసిక పరిస్థితిని పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో న్యాయ వ్యవస్థతో సహా భాగస్వాములైన ప్రతి విభాగం, అధికారులు సున్నితంగా కేసులను పరిష్కరించడంలో మరింత అవగాహన పెంచుకోవాల్సిన అవసరముందని ఆయన అభిప్రాయపడ్డారు. రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమశాఖ, మహిళా భద్రతా విభాగం, యునిసెఫ్, తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సంయుక్త ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో "నోరు లేని వారి గొంతుక - లైంగిక వేధింపులకు గురైన చిన్నారుల హక్కులు, భద్రత"పై సంబంధిత భాగస్వాముల సంప్రదింపుల రాష్ట్ర స్థాయి సమావేశాలు -2025 ప్రారంభోత్సవంలో సూర్యకాంత్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లైంగిక వేధింపుల బారిన పడినవారు రకరకాల మానసిక రుగ్మతల బారిన పడే అవకాశాలెక్కువనీ, డిప్రెషన్‌కు గురై కొన్ని సందర్భాల్లో ఆత్మహత్యలు కూడా చేసుకుంటారని తెలిపారు. వారికి పునరావాసం కల్పించడం ముఖ్యమని గుర్తు చేశారు. కోర్టు నాలుగు గోడల మధ్య భద్రంగా ఉన్నామని భావిస్తే సరిపోదనీ, ఆ గోడల ఆవల భద్రతకు భరోసా ఉందనే పరిస్థితులు రావాలని ఆకాంక్షించారు. పిల్లల భద్రత అందరి సమిష్టి బాధ్యత అని తెలిపారు. వారిని కాపాడుకోలేకపోతే దేశం తన ఆత్మను కోల్పోయినట్టేనని వ్యాఖ్యానించారు. పిల్లలను నిర్లక్ష్యం చేస్తే దేశ భవిష్యత్తును కోల్పోతామని హెచ్చరించారు.



జస్టిస్ సూర్యకాంత్‌కు స్వాగతం పలుకుతున్న సిఎం రేవంత్‌రెడ్డి

సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : ఎం రేవంత్ రెడ్డి

లైంగిక వేధింపుల బాధిత చిన్నారులకు న్యాయం చేయడమంటే నేరస్తులను శిక్షించడం ఒక్కటే కాదని సిఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. బాధితులకు భరోసా కల్పించి, వారికి అవసరమైన రక్షణనిచ్చి, తగిన గౌరవాన్ని అందించి వారికి బాల్యాన్ని తిరిగి ఇవ్వడమని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వానికి మహిళలు, చిన్నారుల భద్రత అత్యంత ప్రాధాన్యమైనవని తెలిపారు. చిన్నారులపై లైంగిక వేధింపులకు పాల్పడే వారిని ఎట్టి పరిస్థితుల్లో ఊపేక్షించేది లేదని హెచ్చరించారు. ఇలాంటి నేరాలను నియంత్రించి బాధితులకు చట్టపరంగా అన్ని రకాల రక్షణ కల్పించాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో బాలికల సంరక్షణ కోసం ప్రభుత్వం "భరోసా" ప్రాజెక్టును తీసుకొచ్చిందనీ, దానికి అనుసంధానంగా 29 కేంద్రాలు పని చేస్తున్నాయని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా పోలీసు సహాయమే కాకుండా న్యాయ పరమైన సహాయం, వైద్య సహాయం, కౌన్సెలింగ్ వంటి సేవలను అందిస్తున్నాయన్నారు. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న భరోసా కేంద్రం ద్వారా చైల్డ్ ఫ్రెండ్లీ కోర్టులను ప్రారంభించిన మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందన్నారు. కేసులను వేగవంతంగా పరిష్కరించడమే కాకుండా పిల్లలకు సంపూర్ణ రక్షణ, వారిలో విశ్వాసం, అభివద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడం ఈ కేంద్రాల లక్ష్యమని వివరించారు. పోక్సో చట్టం, జ్యువెనైల్ చట్టాలు ఆచరణలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఆ చట్టాలు బాధితులకు ఎలాంటి హాని కలిగించకుండా, వారి భవిష్యత్తుకు రక్షణగా సంపూర్ణ సహాయకారిగా ఉండాలని అభిప్రాయపడ్డారు. సోషల్ మీడియా ద్వారా పిల్లలపై జరిగే దురాగతాలు, దుర్వినియోగం చేస్తున్న వారి పట్ల ఎలాంటి కరుణ చూపకుండా దోషుల విషయంలో కఠినంగా వ్యవహరించాలన్నారు. సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇందుకు అవసరమైన చర్యలు తీసుకోవడానికి తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. పిల్లలకు న్యాయం అందించడంలో అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామని సిఎం సూచించారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్ పాల్ మాట్లాడుతూ పిల్లల సంరక్షణకు అన్ని విభాగాలు ఒకే వేదికగా పని చేయాలని సూచించారు. ఏ విభాగానికి ఆ విభాగం కేసులను పరిష్కరించే క్రమంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఇతర విభాగాలతో చర్చించాలని సూచించారు. డిజిపి జితేందర్ మాట్లాడుతూ కోర్టు వ్యవస్థ పిల్లలకు ఫ్రెండ్లీగా ఉండాలని ఆకాంక్షించారు. బాధితులకు సకాలంలో పరిహారం అందిస్తే ఉపయోగకరంగా ఉంటుందన్నారు. యునిసెఫ్ ఇండియా ప్రతినిధి సింథియా మెక్ కాఫ్రే ప్రపంచంలో, దేశంలో చిన్నారుల పరిస్థితిని వివరించారు.



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి పొంగులేటి

త్వరలో కొత్త స్టాంప్ విధానం

- ముసాయిదా రూపకల్పనకు కసరత్తు
- వచ్చే శాసనసభ సమావేశాల్లో బిల్లు
- మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించే ఆలోచన
- ముఖ్యమంత్రితో చర్చించి తుది నిర్ణయం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణలో కొత్త స్టాంప్ విధానం తీసుకొచ్చేందుకు కసరత్తు చేస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో స్టాంప్ డ్యూటీ సవరణ బిల్లుపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ... సాధారణ ప్రజలకు నష్టం కలగకుండా వ్యాపార ఒప్పందాలపై పారదర్శకత ఉండేలా భారతీయ స్టాంపు చట్టం 1899ని అనుసరించి తెలంగాణ సవరణ బిల్లు-2025ను తీసుకురావాలని నిర్ణయించినటు తెలిపారు. వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ఈ బిల్లును తీసుకువచ్చేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని వెల్లడించారు. "తెలంగాణ పరిధిలోని నాలుగు సెక్షన్లతో పాటు ఆర్టికల్ 26ను సవరించేందుకు 2021లో శాసనసభలో సవరణ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపడం జరిగింది. అయితే బిల్లుపై కేంద్ర ప్రభుత్వం వ్యక్తం చేసిన అభ్యంతరాలకు సమాధానం ఇచ్చినప్పటికీ 2023 జనవరిలో మరిన్ని అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వానికి తిరిగి పంపించడం జరిగింది" అని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. 2021లో ప్రవేశపెట్టిన సవరణ బిల్లును ఉపసంహరించుకొని ప్రస్తుత కాలానికి అనుగుణంగా 2025 సవరణ బిల్లును తీసుకురావాలని అధికారులకు మంత్రి సూచించారు. పాత చట్టంలో లేనివాటిని కొత్త చట్టం పరిధిలోకి తీసుకొచ్చేలా ముసాయిదాను సిద్ధం చేయాలని ఆదేశించారు. "విమర్శలకు తావులేకుండా శాస్త్రీయ పద్ధతిలో భూముల ధరల సవరణ జరగాలి. ఏపీ ప్రాంతాల్లో ఎక్కువ వ్యత్యాసం ఉంది. అక్కడ హేతబద్ధంగా ఎంత శాతం పెంచేందుకు అవకాశం ఉంది. తదితర అంశాలపై లోతైన అధ్యయనం చేయాలి" అని మంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభ్యుదయం కోసం ఎన్నో చర్యలు చేపడుతోందనీ, అందులో భాగంగా మహిళలకు స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని చెప్పారు. అలాగే కొత్త, పాత అపార్ట్‌మెంట్లకు స్టాంప్ డ్యూటీ ఒకే విధంగా ఉందనీ, పాత అపార్ట్ మెంట్లకు రిజిస్ట్రేషన్ తేదీలను పరిగణనలోకి తీసుకొని స్టాంప్ డ్యూటీ తగ్గించాలన్న ఆలోచన చేస్తున్నామని పేర్కొన్నారు. సిఎంతో చర్చించి వీటిపై తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సిఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్‌కుమార్, న్యాయవ్యవహారాల కార్యదర్శి రెండ్ల తిరుపతి, స్టాంప్స్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, లపాల్గొన్నారు.

నీటి గుంతలో పడి అక్కాతమ్ముడు మృతి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కొత్త సైకిళ్ల సంబరం పిల్లల ప్రాణం తీసింది. తల్లిదండ్రులు పొలానికి వెళ్లాక.. సైకిళ్లు తొక్కుకుంటూ పొలం వైపు వెళ్లిన అక్కాతమ్ముడు ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడిపోయి మృతి చెందారు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా మావల మండల కేంద్రంలో జరిగింది. ఎస్ఐ ముజాహిద్ తెలిపిన వివరాల ప్రకారం.. లంక స్వామి, గీత దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం గడుపుతున్నారు. శనివారం ఉదయం భార్యాభర్తలు పొలం పనికి ఎడ్ల బండిపై వెళ్లారు. శుక్రవారం వారి పిల్లలు వినూత్న(12), విధాత(9)కు కొత్త సైకిళ్లు కొనిచ్చారు. ఆ సంబరంతో వారు శనివారం సైకిళ్లపై పొలం వైపు వెళ్లారు. మధ్యాహ్నం సమయంలో పిల్లలు కనబడకపోవడంతో కటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. చుట్టుపక్కల గాలిస్తుండగా పొలానికి వెళ్లే దారిలో గ్రీన్ వ్యాల్యూ రోడ్డు పక్కన నీటి గుంతలో సైకిల్ కనిపించింది. నీటి గుంతలో గ్రామస్తులు వెతకడంతో పిల్లల మృతదేహాలు బయటపడ్డాయి. సైకిళ్లపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు నీటి గుంతలో పడిపోతే.. ఒకరిని కాపాడే ప్రయత్నంలో మరొకరు ఇద్దరూ మృతిచెంది ఉంటారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

యాజమాన్య నిర్లక్ష్యం..ప్రభుత్వ ఉదాసీనతే సిగాచి ఘటన

- మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించటంలో నిర్లక్ష్యం
- వలస కార్మిక చట్టాన్ని అమలు చేయాల్సిందే
- రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిగాచి ఘటన అందరినీ నివ్వెరపరిచిందనీ, ఈ ఘోర ప్రమాదానికి యజమాన్య నిర్లక్ష్యం ప్రభుత్వ ఉదాసీనతే కారణమని పలువురు వక్తలు విమర్శించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిఐటియు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో' సిగాచి ప్రమాద బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి' అనే డిమాండ్‌పై రాష్ట్ర ఉపాధ్యక్షులు విఎస్ రావు అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. ఘటనా స్థలాన్ని అన్ని కార్మిక సంఘాలు ఆదివారం పరిశీలించాలనీ, అనంతరం కార్మికశాఖ మంత్రికి వినతి పత్రాన్ని అందజేయాలని నిర్ణయించాయి. 14న హైదరాబాద్‌లోని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించాలనీ, 15న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముందు ధర్నాలు నిర్వహించాలనే తీర్మానాన్ని రౌండ్‌టేబుల్ సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది. అనంతరం భాస్కర్ మాట్లాడుతూ సిగాచి పరిశ్రమలో జరిగిన ప్రమాదం అత్యంత బాధాకరమైందన్నారు. ఇటీవల కాలంలో ఇలాంటి ఘటనలు వరసగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వం, యజమాన్యం మాత్రం ఎంతో కొంత నష్టపరిహారాన్ని ప్రకటించి చేతులు దులుపుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వలస కార్మికుల భద్రత కోసం చట్టాలున్నా..అవి చట్టు బండలుగా మిగిలిపోతున్నాయని చెప్పారు. ఆ చట్టాలను అమలు చేయాల్సి ప్రభుత్వాలు సవరణల పేరుతో వాటిని నిర్వీర్యం చేస్తున్నారని వివరించారు. దిక్కుమొక్కులేని ఆ వలస కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసి పోయాయనీ, దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. పరిశ్రమలను చట్టబద్ధంగా నడిపించాల్సిన యజమాన్యం, లాభాపేక్షతో నిర్లక్ష్యంగా వ్యవహరించటం మూలంగానే ఈ ఘటన జరిగిందని విమర్శించారు. అందుకే యజమాన్యంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పొరుగు రాష్ట్రాల నుంచి తక్కువ వేతనాలిచ్చి, ఎక్కువ గంటలు కార్మికులతో పనిచేయించుకుంటున్నారని ఆరోపించారు. లాభాలు దండుకోవటమే లక్ష్యంగా పరిశ్రమ యజమాన్యాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. సిగాచి ప్రమాదం జరిగిన వెంటనే స్పందించి పరిహారం ప్రకటించి, ఆపన్నహస్తం అందించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ పని ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తరుపున రూ.లక్ష ఆర్థిక సహాయం అందించి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపించారు.

ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజు మాట్లాడుతూ ప్రభుత్వాలు వలస కార్మిక చట్టాన్ని అమలు చేయటంలో నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయని విమర్శించారు.



సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఇప్పటికైనా ఘటన ఎలా జరిగిదో వెలికి తీయాలని డిమాండ్ చేశారు. ఐఎన్‌టియుసి నాయకులు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కాలం చెల్లిన డ్రయ్యర్ వల్లనే ఈ ప్రమాదం జరిగిందని చెప్పారు. దీనికి పరిశ్రమ యజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. టియుసిఐ అధ్యక్షులు సూర్యం మాట్లాడుతూ.. అది సిగాచి కాదు..పిచాచి అని ఇటీవల నవతెలంగాణ ఎడిటోరియల్‌లో ప్రస్తావించిన విషయాలను గుర్తు చేశారు. లాభాపేక్షతో యజమాన్యాలు కార్మికుల ప్రాణాలను పట్టించుకోవటం లేదని చెప్పారు. టిఎన్‌టియూసి రాష్ట్ర అధ్యక్షులు ఎంకే బోస్ మాట్లాడుతూ.. బయటి ప్రాంతాల నుంచి కార్మికులను తీసుకొచ్చి పనిచేయించే పద్ధతికి యజమాన్యాలు అలవాటు పడ్డాయని ఆరోపించారు. వీరితో 12 గంటలకుపైగా పని చేయించుకుంటున్నారని తెలిపారు. కార్మిక శాఖ పర్యవేక్షణ లేకుండా పోయిందని ఆరోపించారు. ఐఎఫ్‌టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రమాదానికి కారణాలను వెలికితీయాలని, యజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ మాట్లాడుతూ సిగాచి ప్రమాదం హృదయవిదారకమైందని ఆవేదన వ్యక్తం చేశారు. వరస ఘటనలు జరుగుతున్నా ప్రభుత్వం ఎందుకు నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తున్నదో కార్మికులకు సమాధానం చెప్పాలని నిలదీశారు. టీయూసీఐ కార్యదర్శి ఎస్ఎల్ పద్మ మాట్లాడుతూ ఆ పరిశ్రమలో ప్రమాదం జరిగిన సమయంలో ఎంత మంది పని చేస్తున్నారో స్పష్టత లేదని ఆరోపించారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేశ్, పి శ్రీకాంత్, కూరపాటి రమేష్, వంగూరు రాములుపాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీరు కలుషితం

- ఐదు రోజులుగా నల్లాల్లో ఎర్రటి రంగులో సరఫరా
- బిందెల్లో పేరుకుంటున్న బురద
- ఎలా తాగాలని ప్రశ్నిస్తున్న జనాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిషన్ భగీరథ ద్వారా సరఫరా అవుతున్న తాగునీరు పూర్తిగా కలుషితమైంది. నల్లాల్లో నుంచి ఎర్రటి రంగులో నీరు వస్తోంది. బిందెల్లో పట్టాక అడుగున బురద పేరుకుపోతోంది... దాంతో ఈ నీటిని ఎలా తాగాలంటూ జనం ఆవేదన వ్యక్తం చేశారు. నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలోని పోతునూరు గ్రామంలో నీరు పూర్తిగా కలుషితంగా మారింది. ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద ఇంటింటికీ తాగునీటిని అందిస్తోంది. వర్షాకాలం ట్యాంకులు శుభ్రంగా ఉంచాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పైపులు పగిలిన చోట సరైన మరమ్మతులు చేయకపోవడంతో మొత్తం మురికి నీళ్లు ట్యాంక్‌లోకి వెళ్తున్నాయి. అదే నీటిని సరఫరా చేయడంతో తాగడానికి వీలులేకుండా బిందెలు, సంపుల్లోని అడుగుభాగంలో మొత్తం బురద పేరుకుపోతున్నది. పోతునూరు గ్రామంలో ప్రయివేట్ ప్లాంట్ల ఫిల్టర్ వాటర్ తాగడంతో పలురకాల వ్యాధులు వస్తున్నాయని చాలామంది మిషన్ భగీరథ నీటినే తాగుతున్నారు. అయితే, ఆ నీరు ఐదు రోజులుగా వాడుకోవడానికి కూడా వీలు లేనంత మురికిగా వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. వాటర్‌మెన్‌లను అడిగితే పైనుండే అలా వస్తున్నాయని చెబుతున్నారని స్థానిక మహిళలు వివరించారు. అసలే వర్షాకాలం కావడంతో మురికినీరు తాగితే ఎలాంటి వ్యాధులు వస్తాయోనని ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ట్యాంక్ లోకి నీళ్లవచ్చే ఇనుప పైపు మొత్తం తుప్పు పట్టిపోయింది. ఇంచు మందం సిలుము పట్టింది. అధికారులు స్పందించి కలుషిత నీరు సరఫరా కాకుండా చూడాలని, కొత్త పైపు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కలుషితమైన నీటిని పట్టుకుంటున్న మహిళలు

బురద నీరు వస్తోంది : మేడారం సైదమ్మ

ఐదు రోజులుగా నల్లాల్లో మొత్తం బురద నీరువస్తోంది. బిందెల్లో అడుగు భాగంలో బురద పేరుకుంటున్నది. గతంలో ఎప్పుడూ తాగునీటిలో ఇంత మురికి చూడలేదు. నల్లాల్లో తాగునీరు ఎర్రటి రంగులో వస్తోంది. వేడి చేసి వడపోసినా నీరు రంగు మారడం లేదు.

2036 ఒలంపిక్స్‌లో పతకాలే లక్ష్యంగా పనిచేయాలి

- అధికారులకు క్రీడాశాఖ మంత్రి వాకిటి ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఒలంపిక్స్ (2036)లో పతకాలే లక్ష్యంగా పనిచేయాలని క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని బిఆర్.అంబ్కేర్ సచివాలయంలో క్రీడా శాఖపై స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డితో కలిసి శనివారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తశుద్ధితో పనిచేస్తే లక్ష్యాన్ని సాధించడం సులభతరభమని అన్నారు. క్రీడా రంగంలో సమూల మార్పు కోసం కార్యాలయాల్లో కూర్చుంటే సాధ్యం కాదనీ, క్షేత్రస్థాయిలో పర్యటించి సందర్భానుసారంగా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. క్రీడారంగంలో కాలానుగుణంగా వస్తున్న మార్పులపై నిపుణులతో చర్చించాలని ఆదేశించారు. పాఠశాల విద్యాశాఖతో సమన్వయం చేసుకుని క్రీడాకారులను గుర్తించి వారికి తగిన శిక్షణ అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్రీడల శాఖ ప్రత్యేక కార్యదర్శి జయేష్ రంజన్, స్పోర్ట్స్ అథారిటీ మేనేజింగ్ డైరెక్టర్ సోనీ బాలాదేవి తదితరులు పాల్గొన్నారు

డిజిటల్ అరెస్టు పేరుతో మోసం

- రూ.53 లక్షలు కాజేసిన నిందితులు
- క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని రూ.2.03 లక్షలు దండుకున్న వైనం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రోజుకో తీరులో సైబర్ నిందితులు జనాన్ని దోచుకుంటున్నారు. తాజాగా డిజిటల్ అరెస్టు పేరుతో ఓ వృద్ధున్ని భయపెట్టి రూ.53 లక్షలు కాజేశారు. మరో కేసులో క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని నమ్మించిన నిందితులు బాధితుని నుంచి రూ.2.03 లక్షలు దండుకున్నారు. ఇందుకు సంబంధించి శనివారం సైబర్‌క్రైమ్ పోలీసులు వివరాలు వెల్లడించారు. అమీర్‌పేట్‌కు చెందిన 77 ఏళ్ల వృద్ధునికి గత నెల 18న డిల్లీ డిసిపి రాజీవ్ కుమార్ పేరుతో వీడియో కాల్ వచ్చింది. ఫోన్ చేసిన సైబర్ నిందితులు పోలీస్ డ్రెస్‌లో ఉండి.. వృద్ధుడిపై మనీలాండరింగ్ కేసు నమోదైందని బెదిరించారు. అరెస్టు వారెంట్ జారీ అయిందని, బ్యాంక్ ఖాతాలు ఫ్రీజ్ చేస్తామని హెచ్చరించారు. నగదు ఫ్రీజ్ చేయాలని కోర్టు ఆర్డర్ కాపీ ఉందంటూ వృద్ధున్ని భయాందోళనకు గురిచేశారు. వారు చెప్పిన మాటలు, వారు వేసుకున్న పోలీస్ దుస్తులు చూసి బాధితుడు నిజమేనని బయపడ్డారు. తనపై కేసు నమోదు చేయొద్దని వేడుకున్నారు. దాంతో వారు చెప్పిన విధంగా బాధితుడు తన బ్యాంక్ ఖాతా నుంచి రూ.53 లక్షలు పలు దఫాలుగా ట్రాన్స్‌ఫర్ చేశారు. అయితే, విచారణ అనంతరం డబ్బులు తిరిగి పంపిస్తామని చెప్పిన సైబర్ నేరస్థుల ఫోన్‌లు స్విచ్ఛాఫ్ వచ్చాయి. దాంతో అనుమానం వచ్చిన బాధితుడు హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

67 ఏళ్ల వృద్ధునికి కుచ్చు టోపీ

క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని 67 ఏళ్ల వృద్ధున్ని నమ్మించిన సైబర్ నేరస్థులు రూ.2,03,020 దండుకున్నారు. షేక్‌పేట్‌కు చెందిన ఓ వృద్ధుడికి వీడియోకాల్ చేసిన సైబర్ నిందితులు తాము హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ కస్టమర్ కేర్ నుంచి మాట్లాడుతున్నామని నమ్మించారు. మీ క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామని చెప్పారు. స్క్రీన్ షేరింగ్ ఇవ్వాలని ఓ లింక్‌ను పంపించారు. ఫోన్ మాట్లాడుతూనే మాయమాటలతో బాధితుని నుంచి పూర్తి వివరాలు సేకరించారు. ఆ తర్వాత నీ లిమిట్ రూ.2.5 లక్షలు పెరిగిందని, అప్‌డేట్ కావడానికి 24 గంటల సమయం పడుతుందని నమ్మించారు. అయితే, కొద్ది సేపటికే ఖాతా నుంచి రూ.2,03,020 కట్ అయినట్టు సమాచారం రావడంతో ఆందోళనకు గురైన బాధితుడు సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసుల్లో ఫిర్యాదులను స్వీకరించిన పోలీసులు అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. ఎవరైనా డిజిట్ అరెస్టులు చేస్తామని భయపెడితే సమీపంలోని పోలీసులకుగానీ 1930కుగానీ ఫిర్యాదు చేయాలని సూచించారు.

డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరుతో దోపిడీ చేస్తే కఠిన చర్యలు

- ప్రయివేటు ఆస్పత్రులకు మంత్రి దామోదర హెచ్చరిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డెంగీ, ప్లేట్‌లెట్స్ పేరుతో దోపిడీ చేసే ప్రయివేటు ఆస్పత్రులపై కఠిన చర్యలు తీసుకుంటామని వైద్యారోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. ఈ మేరకు ఆయా ఆస్పత్రులపై నిఘా పెట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లో ఆయన సీజనల్ వ్యాధుల నివారణ, నియంత్రణపై శనివారం సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో మే నెల నుంచి వర్షాలు ప్రారంభమవ్వడంతో వాతవరణంలో మార్పులొచ్చాయని, అప్పటి నుంచే అక్కడక్కడ సీజనల్ వ్యాధులు మొదలయ్యాయని అధికారులు మంత్రికి తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈసారి చాలా జిల్లాల్లో డెంగ్యూ కేసులు తక్కువగా నమోదయ్యాయనీ, గ్రేటర్ హైదరాబాద్‌లోనూ స్వల్పంగా కేసులు పెరిగాయని తెలిపారు. 19 జిల్లాల్లో పది కంటే తక్కువ కేసులు నమోదవగా, మిగిలిన జిల్లాల్లో పదికంటే ఎక్కువ కేసులు నమోదయ్యాయన్నారు. గతేడాదితో పోలిస్తే టైఫాయిడ్ కేసులు కూడా చాలా తక్కువ నమోదయ్యాయన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాలు, గ్రేటర్ హైదరాబాద్‌లో యాంటిలార్వల్ ఆపరేషన్‌ను విస్తృతం చేయాలన్నారు. ఆయా వ్యాధుల తీవ్రత ఎక్కువగా ఉన్న జిహెచ్‌ఎంసి జోన్లకు స్పెషల్ ఆఫీసర్లను నియమించాలని జిహెచ్‌ఎంసి అధికారులను ఆదేశించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణపై కలెక్టర్లతో సమీక్షించాలని హెల్త్ సెక్రటరీకి మంత్రి సూచించారు. ట్రైబల్ ఏరియాలపై ఎక్కువగా ఫోకస్ పెట్టాలనీ, ఐటిడిఎ పిఒలతో సమన్వయం చేసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పనిచేసే వైద్య సిబ్బంది ఇంటింటి సర్వే చేసి, ప్రజలకు అవగాహన కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కేసులు ఎక్కువగా నమోదవుతున్న జిల్లాల్లో ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు పర్యటించాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధుల బారిన పడిన పేషెంట్లకు చికిత్స అందించేందుకు హాస్పిటళ్లలో అవసరమైన అన్ని వసతులతో సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఆస్పత్రులన్నింటిలో అవసరమైన ఔషధాలను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రతి సోమవారం నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలకు కల్పించేందుకు ఆరోగ్యశాఖ రూపొందించిన కరపత్రాలను ఈ సందర్భంగా మంత్రి ఆవిష్కరించారు.

IN THE COURT OF HON'BLE PRINCIPAL DISTRICT AT THIRUVALLORE
I.D.O.P. No 209 of 2021

D. Hoglah
Wife of CH. Lakshman Prasad @
CH. Paul Prasad,
Block C1-G2,, Sumeru City Nagar,
Dakshin Emerald, IAF Road,
Selaiyur,
Chennai–600073.
... Petitioner

-Vs-

CH. Lakshmana Prasad @
CH. Paul Prasad,
Son of Chintapalli Ramachandra Rao
2-52/17, BupathRao Nagar, Old Alwal, Secunderabad–500 067.
... Respondent

To,
CH. Lakshmana Prasad @
CH. Paul Prasad,
Son of Chintapalli Ramachandra Rao
2-52/17, BupathRao Nagar, Old Alwal, Secunderabad–500067.

The above petition has been filed by the petitioner namely D. Hoglah against you for the Divorce. Kindly take notice to appear before the above said court on 05.08.2025 at 10.30 A.M. failing which the petition in IDOP.No.209 of 2021 on the file of before the hon'ble Principal District at Thiruvallure will be decided in your absence.

Ilayarani Ponraj,
Counsel for Petitione.

గౌరవనీయ ప్రిన్సిపల్ జిల్లా కోర్టులో తిరువల్లూరులో
I.D.O.P. 209 సం 2021

D. హెూగ్లా
CH భార్య. లక్ష్మణ్ ప్రసాద్ @
సిహెచ్. పాల్ ప్రసాద్,
బ్లాక్ C1-G2, సుమేరు సిటీ నగర్,
దక్షిణ్ ఎమరాల్డ్, IAF రోడ్, సెలైయూర్,
చెన్నై - 600 073.
...పిటిషనర్

-Vs-

CH. లక్ష్మణ ప్రసాద్ @
సిహెచ్. పాల్ ప్రసాద్,
చింతపల్లి రామచంద్రరావు కుమారుడు
2-52/17, బుపత్ రావ్ నగర్,
ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ - 500 067.
... ప్రతివాది

కు
CH. లక్ష్మణ ప్రసాద్ @
సిహెచ్. పాల్ ప్రసాద్,
చింతపల్లి రామచంద్రరావు కుమారుడు
2-52/17, బూపత్‌రావు నగర్,
ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్ – 500 067.

విడాకుల కోసం పిటిషనర్ డి. హెూగ్లా మీపై పై పిటిషన్ దాఖలు చేశారు. దయచేసి 05.08.2025న ఉదయం 10.30 గంటలకు పైన పేర్కొన్న కోర్టు ముందు హాజరు కావాలని నోటీసు తీసుకోండి. లేని పక్షంలో 2021లోని IDOP.No.209లోని పిటిషన్‌ను గౌరవనీయులైన తిరువళ్లూరు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ ముందు మీ గైర్హాజరీలో నిర్ణయిస్తారు.

ఇళయరాణి పొన్‌రాజ్
పిటిషనర్ తరపు న్యాయవాది

IN THE COURT OF THE HON BLE XI ADDL, DISTRICT JUDGE, R.R.DIST., AT :: L.B.NAGAR
O.S.No. 67 OF 2025

Between:-
N. Kumar Yadav,
...Plaintiff

AND

Smt.K. Jyothi, & others
...Defendants

COURT SUMMONS

To,
B. SRINIVASU, S/o Nageshwar Rao,
Age 47-Years, Occ: Farmer,
R/o MIG-117, Madhuban Colony, Katedan,
Rajender Nagar, Ranga Reddy District.
...DEFENDANT No.5

WHEREAS the Plaintiff filed the above Suit for Specific Performance of the Agreement of Sale under Specific Relief Act in respect of land an extent of Ac.1-16Gts., in Sy.No.60/UU, Sy.No.61/U, situated at Kaveliguda -Village, Shamshabad - Mandal, Ranga Reddy District against D1 to D5. That as per orders of this Hon'ble Court, this Publication is made against You i.c. D5 for causing you to appear on 24.07.2025 at 10.30 AM in the above Suit.

Hence, You i.e. D5 are hereby directed to appear either in person or through your Advocate duly instructed to appear and answer the above Suit-Claim on 24.07.2025 at 10.30 AM at L.B.Nagar, failing which the matter will be heard and decided in your absence by setting you Ex.Parte.

// BY ORDER OF THE COURT //

Sd/-
M/s Srikanth Sharath Babu,
G.Ravinder Goud, & K. Jai Kishan,
ADVOCATES
8-3-165/13/12, Behind Gokhul Theatre,
Erragadda, Hyderabad-018.
Cell: 9948440168 & 9908196917
Council for Plaintiff

IN THE COURT OF THE HON'BLE XI ADDL. DISTRICT JUDGE, R.R.DIST.. AT L.B.NAGAR
1.A.No. 01 OF 2025
I N
O.S.No. 67 OF 2025

Between:-
N. Kumar Yadav,
...Petitioner/Plaintiff

AND

Smt.K. Jyothi, & others
...Respondents/Defendants

COURT SUMMONS

To,
B. SRINIVASU, S/o Nageshwar Rao,
Age 47-Years, Occ: Farmer,
R/o MIG-117, Madhuban Colony,
Katedan, Rajender Nagar,
Ranga Reddy District.
...RESPONDENT No.5

WHEREAS the Plaintiff filed the above Suit for Specific Performance of the Agreement of Sale under Specific Relief Act in respect of land an extent of Ac.1-16Gts., in Sy.No.60/UU, Sy.No.61/U, situated at Kaveliguda-Village, Shamshabad-Mandal, Ranga Reddy District against D1 to D5. That as per orders of this Hon'ble Court, this Publication is made against in the above-said Petition for causing you to appear on 24.07.2025 at 10.30 AM in the above-said Petition.

Hence, You i.e. R5 are hereby directed to appear cither in person or through your Advocate duly instructed to appear and answer the above-said Petition in the above Suit on 24.07.2025 at 10.30 AM at L.B.Nagar, failing which the matter will be heard and decided in your absence by setting you Ex.Parte.

// BY ORDER OF THE COURT //

Sd/-
M/s Srikanth Sharath Babu, G.Ravinder Goud,
& K. Jai Kishan, ADVOCATES
8-3-165/B/12, Behind Gokhul Theatre,
Erragadda, Hyderabad-018.
Cell: 9948440168 & 9908196917

IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 458 OF 2024

Between:
Bank of Baroda, Yousufguda Branch Rep. by its Branch Manager, St Mary"s College Building, Tahir Villa, Yousufguda Check Post, Hyderabad- 500 045
...Plaintiff

AND

Mr. Challa Ashok Babu S/ o. Challa Ramanandham Age: 36 Yrs, Occ: Police Constable Police Department Service, ID No.2018 080591 Office address at 1st BN Police Line, Police Quarters, Yousufguda, Hyderabad - 500 045, Ph no. 96668 70143 Also, at Permanent address at H No. 3-115, Thodella Gudem, Kannegundla, Warangal District, Telanagana-506 381.
...Defendant

NOTICE

The General Public are hereby informed that the petitioner/Plaintiff has filed a petition for the recovery of money. The Hon'ble Court has scheduled the matter for objections on or before 24.07.2025 at 10:30 A.M. Any person having objections to the said petition may appear before the Hon'ble Court in person or through a pleader duly instructed on the aforementioned date and time to present their objections.

Please note that in the event of failure to appear on the scheduled date, the matter shall be heard and decided in your absence.

// BY ORDER OF THE COURT //

V. EKANTHA RAO
B. NARASINGA RAO
ADVOCATES
Office : HNo. 1-88/10/1, Ratna Nilayam,
Landmark : Shabari Gardens,
Malikarjunnagar, Parvathapur, Medipally
Hyderabad-500 098
Mob: 91+7095434824, 9000001477

దామోదర్ లొంగుబాటు తప్పుడు ప్రచారమే..

- ఆపరేషన్ కగార్ పాశవిక చర్య
- సిపిఐ(మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఐ(మావోయిస్టు) తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు దామోదర్ లొంగిపోతున్నట్టు పత్రికల్లో వచ్చిన వార్తలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జగన్ ఒక లేఖను విడుదల చేశారు. పోలీసులు ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేశారని పేర్కొన్నారు. దామోదర్ ఎన్‌కౌంటర్‌లో మరణించాడని, లొంగిపోయాడంటూ అనేకసార్లు మీడియాలో ప్రచారం చేశారన్నారు. జూన్ 26వ తేదీన మంత్రి సీతక్కపై వచ్చిన పత్రికా ప్రకటనకు తమ పార్టీకి ఎలాంటి సంబంధమూ లేదన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం వ్యతిరేకిస్తోందని, ఎన్‌కౌంటర్లు ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసిందని లేఖలో పేర్కొన్నారు. మావోయిస్టు సమస్య అనేది సామాజిక, రాజకీయ సమస్య అని, అణచివేతలతో మావోయిస్టు పార్టీని నిర్మూలించడం సరికాదని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన విషయం ప్రజలందరికీ తెలిసిందేనన్నారు. తెలంగాణలో మావోయిస్టు కార్యక్రమాలు లేకున్నా ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఆసిఫాబాద్ జిల్లాల్లో మావోయిస్టులకు సహకరించొద్దని పోలీసులు ఆదివాసీలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు.

ఢిల్లీ పాలకులు దిగివచ్చేలా రైల్‌రోకో

- బిసి రిజర్వేషన్ల ఉద్యమంలో పౌర సమాజం కలిసి రావాలి
- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఢిల్లీ పాలకులు దిగివచ్చేలా రైల్ రోకో నిర్వహిస్తామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బిఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తేల్చిచెప్పారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం చేపట్టిన ఈ ఉద్యమంలో పౌర సమాజం కలిసి రావాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ జాగృతి, యుపిఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల 17న తలపెట్టిన రైల్ రోకోకు భీం ఆర్మీ నాయకులు సంఘీభావం ప్రకటించారు. భీం ఆర్మీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ ఆయాజ్ ఆధ్వర్యంలో నాయకులు బంజారాహిల్స్‌లోని నివాసంలో ఎమ్మెల్సీ కవితతో సమావేశమయ్యారు. రైల్ రోకోకు భీం ఆర్మీ చీఫ్, ఎంపీ చంద్రశేఖర్ ఆజాద్ మద్దతు ప్రకటించారని తెలిపారు. రైల్ రోకోలో తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... స్థానిక సంస్థల్లో బిసిలకు 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు సాధించడంతో పాటు విద్య, ఉద్యోగాల్లోనూ 42 శాతం రిజర్వేషన్లు సాధించుకోవాలంటే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెట్టడం ఒక్కటే మార్గమన్నారు. రిజర్వేషన్ల పెంపు బిల్లులను రాష్ట్ర శాసనసభ, శాసన మండలి ఆమోదించి కేంద్రానికి పంపిస్తే ఆమోదించకుండా నెలల తరబడి పెండింగ్‌లో పెట్టారని విమర్శించారు. బిసి రిజర్వేషన్లు ఇవ్వకుండానే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ప్రయత్నాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రిజర్వేషన్లు కల్పించకుంటే కాంగ్రెస్ పార్టీకి తగిన రీతిలో బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భీం ఆర్మీ రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణ, హన్మంతరావు, సురేశ్ కుమార్, యూపీఎఫ్ కో ఆర్డినేటర్ ఆలకుంట హరి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ కార్డుల రద్దు చేసేందుకు కాంగ్రెస్ సర్కారు కుట్ర

రాష్ట్రంలో రేషన్ కార్డులను రద్దు చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రలు చేస్తోందని 'ఎక్స్' వేదికగా కవిత ఆందోళన వ్యక్తం చేశారు. వర్షాకాలం నేపథ్యంలో ప్రభుత్వం జూన్‌లో ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ చేసిందన్నారు. అనివార్య కారణాలతో 7.24 లక్షల కుటుంబాలు తీసుకోలేదని తెలిపారు. రేషన్ తీసుకోకపోవడా న్ని సాకుగా చూపుతూ ఏడు లక్షలకు పైగా కుటుంబాల రేషన్ కార్డులను తొలగించే ప్రయత్నాల్లో ప్రభుత్వం ఉందని ఆరోపించారు. ఆ ప్రయత్నాలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టిన ఆర్‌టిసి బస్సు

- మహిళ మృతి, ఒకరికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

టివిఎస్ లూనాను ఆర్‌టిసి బస్సు ఢీ కొట్టడంతో ఓ మహిళ మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బీబీనగర్ మండలం మొగ్గుంపల్లికి చెందిన సిల్వేరు సత్యనారాయణ, మల్లమ్మ దంపతులు ఉదయం టీవీఎస్ లూనాపై వస్తున్నారు. భువనగిరి పట్టణంలోని జంఖన్నగూడెం చౌరస్తా వద్ద నల్లగొండ నుంచి భువనగిరి వైపు వస్తున్న ఆర్‌టిసి బస్సు ఆగి ఉన్న లూనాను వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లమ్మ (40) అక్కడికక్కడే మృతి చెందారు. సత్యనారాయణకు గాయాలయ్యాయి. దంపతులకు ముగ్గురు కుమార్తెలు, ఉండగా ఒక కుమార్తె వివాహం అయింది. మరో ఇద్దరు పాఠశాల విద్య చదువుతున్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ పోలీసులు తెలిపారు.

'సిగాచి'పై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

- యాజమాన్యాన్ని అరెస్టు చేయాలి
- మృతుల కుటుంబాలకు రూ.కోటి పరిహారం చెల్లించాలి
- సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం ధర్నా



సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ వద్ద సిపిఎం నేతలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాశమైలారం ప్రాంతంలోని సిగాచి కెమికల్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంపై సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు డిమాండ్ చేశారు. పరిశ్రమ యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని, గాయపడిన వారికి మెరుగైన వైద్య సేవలు, రూ.50 లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ శనివారం సిపిఎం సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. తక్షణం మృతుల కుటుంబాలకు కోటి రూపాయల పరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పరిశ్రమల్లో సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించని అధికారులను సస్పెండ్ చేయాలన్నారు. ప్రమాదానికి కారణమైన పరిశ్రమ యాజమాన్యాన్ని ఇప్పటివరకు అరెస్టు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ప్రమాదంలో శాశ్వత వైకల్యం కల్గిన వారికి రూ.50 లక్షలు, గాయపడిన వారికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

బాధితుల పక్షాన అండగా ఉంటున్నాం..

సిగాచి ప్రమాదం జరిగిన నాటి నుంచి తమ పార్టీ బాధితుల పక్షాన నిలబడుతోందని చుక్క రాములు చెప్పారు. 11 కుటుంబాలకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సహాయం అందజేశామన్నారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మల్లేశం, రాజయ్య, మాణిక్, సాయిలు, నర్సింలు, జిల్లా కమిటీ సభ్యులు నాగేశ్వర్‌రావు, విద్యాసాగర్, కృష్ణ, నాయకులు పాండురంగారెడ్డి, నర్సింహారెడ్డి, బాగారెడ్డి, నాగభూషణం, బాలరాజు, శివకుమార్, విఠల్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

యాజమాన్యాల పట్ల ప్రభుత్వాల ఉదారభావం

- కార్మిక చట్టాల నిర్వీర్యం ఫలితమే సిగాచి ఘటన
- సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ ఎంపీ రాజారాం సింగ్
- సిగాచి ఫ్యాక్టరీ సందర్శన, బాధితులకు పరామర్శ


విలేకరులతో మాట్లాడుతున్న రాజారాం సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఫ్యాక్టరీ యజమాన్యాల పట్ల ప్రభుత్వాలు ఉదారభావంతో వ్యవహరిస్తున్నాయని, దాని ఫలితంగానే కార్మికులు శ్రమ దోపిడీతోపాటు ప్రాణం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ బీహార్ రాష్ట్రం కరాకట్ ఎంపి, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు రాజారాం సింగ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పాశమైలారం సిగాచి ఫ్యాక్టరీలో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని ఎంపి రాజారాం సింగ్, ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు మనోజ్ మంజిల్, నైనాలశెట్టి మూర్తిలు శనివారం సందర్శించారు. బాధితుల కుటుంబాలను పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాజారాం సింగ్ విలేకరులతో మాట్లాడుతూ.. పారిశ్రామికవేత్తల అనుకూలమైన విధానాలతో మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందని, వీటి ద్వారా భవిష్యత్‌లో మరిన్ని సిగాచి ఘటనలు జరగనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన ప్రమాదాల్లో సిగాచి ఘటన పెద్దదని, యాజమాన్యమే ఈ ఘటనకు బాధ్యత వహించాలని, కార్మికులకు పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. యాజమాన్యం అందించే సాయంతోపాటు ప్రభుత్వ సహాయం అధికంగా ఉండాలని, ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వలస కార్మికుల విషయంలోనూ అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట పార్టీ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్ రాజా, రాష్ట్ర కమిటీ సభ్యులు నూనవత్ వీరు నాయక్, ఏఐసీసీటీయు రాష్ట్ర కార్యదర్శి రొయ్యల రాజు, నాయకులు మహంకాళి శ్రీనివాస్ ఉన్నారు.

దేశ రక్షణ కోసం ఐక్య ఉద్యమం

- ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర బాధ్యులు : తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశ రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమించాలని, జులై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలందరూ పెద్దఎత్తున పాల్గొనాలని ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర బాధ్యులు తమ్మినేని వీరభద్రం పిలుపునిచ్చారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని మంచికంటి భవన్‌లో శనివారం సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజె.రమేష్ అధ్యక్షతన ప్రజాసంఘాల పోరాట వేదిక సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ.. కార్పొరేట్లకు దేశ సంపదను కట్టబెట్టేందుకే బిజెపి ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందని విమర్శించారు. దేశ వ్యాప్తంగా 44 కోట్ల మంది కార్మికులు బిజెపి ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సార్వత్రిక సమ్మె చేస్తున్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలని, అధిక ధరలు తగ్గించాలని, ఉపాధి హామీ చట్టం రక్షణకు, మహిళలపై జరుగుతున్న దాడులు ఆపాలని డిమాండ్ చేస్తూ సమ్మెలో భాగస్వామ్యం కావాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరిస్తూ.. రాజ్యాంగంపై, ప్రతిపక్షాలపై, రచయితలు, మీడియాపై తీవ్రమైన దాడులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగంలోకి కూడా కార్పోరేట్ శక్తులను తీసుకురావడం కోసం మూడు నల్ల చట్టాలను మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. దేశాన్ని కాపాడేందుకు కార్మికులు, కర్షకులు ఐక్యంగా సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రాల అభివృద్ధే దేశాభివృద్ధి

- నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అరవింద్ కుమార్
- వనపర్తి జిల్లాలో రెండు రోజుల పర్యటన



సమావేశంలో మాట్లాడుతున్న అరవింద్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారతదేశ వికాసం అనేది జిల్లాలు, రాష్ట్రాల వికాసంపైనే ఆధారపడి ఉంటుందని నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి అరవింద్ కుమార్ అన్నారు. నీతి అయోగ్ డిప్యూటీ సెక్రెటరీ అరవింద్ కుమార్, డిప్యూటీ డైరెక్టర్ సెంట్రల్ వాటర్ కమిషన్ అరుణ్ కుమార్, సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ సైంటిస్ట్ పి.యాదయ్య, సహాయకులు శనివారం వనపర్తి జిల్లాను సందర్శించిందన్నారు. వారికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి కలెక్టరేట్‌లో స్వాగతం పలికారు. అనంతరం సమావేశ మందిరంలో సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరా, అవాంతరాలను అధిగమించేందుకు చేపట్టిన చర్యలపై ప్రొజెక్టర్ ద్వారా నివేదిక రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సెక్రెటరీ అరవింద్ కుమార్ మాట్లాడుతూ.. 2047లో దేశాన్ని అన్ని రంగాల్లో వికసిత దేశంగా చూసేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి అనేక కార్యక్రమాలు చేపడుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ఏవిధంగా అమలు అవుతున్నాయో పరిశీలించి నివేదిక ఇచ్చేందుకు వనపర్తి జిల్లాలో శని, ఆదివారం రెండ్రోజులు పర్యటిస్తున్నట్టు తెలిపారు. జిల్లాలోని అచ్యుతాపుర్, ఖాసింనగర్, కానాయపల్లి మంచినీటి శుద్ధి కేంద్రం, రాజీవ్ భీమాలిఫ్ట్ ఇరిగేషన్-2వ కెనాల్‌ను సందర్శించారు. నాణ్యత ప్రమాణాలు ఏవిధంగా ఉన్నాయి, సమస్యలు వస్తే ఏ విధంగా అధిగమిస్తున్నారు అనే విషయాలను తెలుసుకోడానికి వచ్చామన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ ఇన్‌చార్జి యాదయ్య, మిషన్‌భగీరథ ఎస్‌ఈ వెంకటరమణ, ఇరిగేషన్ ఎస్ఐ శ్రీనివాస్ రెడ్డి, మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి, పీడీ డీఆర్డీఓ ఉమాదేవి, అధికారులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో ఎఐ టెక్నాలజీ

- మంత్రి తుమ్మలకు వివరించిన సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రైతులకు అందుబాటులో ఎఐ టెక్నాలజీని తీసుకునిరావాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఈ నేపథ్యంలోనే కృషివాస్ సంస్థ ప్రతినిధులతో పలు దఫాలుగా మంత్రి సమీక్షలు నిర్వహించారు. యాప్‌లో చేయాల్సిన మార్పులు, సలహాలు, సూచనలు, ఫీల్డ్ వెరిఫికేషన్ చేయాలని ఆదేశించారు. ఇలాంటి యాప్‌లను వినియోగించడం వల్ల రైతుల విలువైన సమయం ఆదా అవడంతో పాటు, రైతులు తమ పంటలకు ఖచ్చితమైన నివారణ చర్యలు తీసుకునే వీలుకలుగుతుందని అభిప్రాయపడ్డారు. రైతులందరు ఈ టెక్నాలజీని వినియోగించుకోవాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కృషివాస్ సంస్థ ప్రతినిధులతో మంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వ్యవసాయంలో ఎఐ టెక్నాలజీ పనితీరును ఆ సంస్థ ప్రతినిధులు మంత్రి వివరించారు. ఆ టెక్నాలజీతో శాటిలైట్ ఇమేజింగ్ ద్వారా ముందస్తుగానే పంటలకు వచ్చే చీడ, పీడలను గుర్తించి, వాటిని మొదట్లోనే నిరోధించే విధంగా టెక్నాలజీ పని చేస్తుందని తెలిపారు. పంట బయటకు కనిపించే వాటినే కాకుండా పంట అంతర్గతంగా ఉన్న రోగాన్ని కూడా గుర్తించి దాని నివారణకు ఏం చర్యలు తీసుకోవాలో కూడా చెబుతున్నదన్నారు. పొలంలో ఏ మొక్క, ఏ ప్రాంతంలో తెగులు సోకిందో ముందుగానే గుర్తించి, దానికి పిచికారి చేయాల్సిన మందును కూడా సూచిస్తుందని చెప్పారు. పొలం దగ్గరకు పోకుండా ఈ యాప్ ద్వారా పంట స్థితిగతులను తెలుసుకోవచ్చని తెలిపారు. తక్కువ ఖర్చుతో, అధిక దిగుబడి పొందే అవకాశం కలుగుతోందని అన్నారు. అలాగే ఈ ఎఐ యాప్ ద్వారా మరిన్ని ప్రయోజనాలు ఉన్నాయని గుర్తు చేశారు. ముందస్తు సమాచారం, సమస్యను గుర్తించడం, సమస్య ఉన్నచోటే స్ప్రే చేయడం, వాతావరణ హెచ్చరికలు, నేల, ఆకు తేమ సమాచారం, ఆయిల్‌పామ్‌లో ప్రతి చెట్టుకు రియల్ టైమ్ సమాచారం ఇస్తున్నదని తెలిపారు. ఈ యాప్ ద్వారా 60కు పైగా పంటలను పరీక్షించే అవకాశం ఎఐకి ఉందని వివరించారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం

- తెలంగాణ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ నెల తొమ్మిదిన జరుగనున్న దేశవ్యాప్త కార్మిక సార్వత్రిక సమ్మెలో చేతి వృత్తిదారులంతా పాల్గొనాలని ఆ సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ ఎంవి రమణ పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లోని వృత్తిదారుల భవన్‌లో తెలంగాణ వృత్తిదారుల సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... ఎన్నో ఏండ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మోడీ సర్కార్ రద్దు చేసిందని గుర్తు చేశారు. కార్పొరేట్లకు ఉపయోగపడే విధంగా నాలుగు లేబర్ కోడ్లను తీసుకొచ్చిందనీ, దీంతో కార్మిక హక్కులు పూర్తిగా హరించబడతున్నాయని తెలిపారు. ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణ విధానాలు వృత్తిదారులకు ఉరితాళ్ళు గా మారుతాయని ఆవేదన వ్యక్తం చేశారు.

విఆర్‌ఒ, విఆర్‌ఎలకు మరోసారి జిపిఒ పరీక్ష

- రెవెన్యూ ఉద్యోగ సంఘాలతో మంత్రి పొంగులేటి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రెవెన్యూ ఉద్యోగ సంఘాల విజ్ఞప్తి మేరకు విలేజ్ రెవెన్యూ ఆఫీసర్ (విఆర్‌ఒ), విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ (విఆర్‌ఎ)లకు జిపిఒగా అవకాశం కల్పించేందుకు మరోసారి అర్హత పరీక్ష నిర్వహించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. రెవెన్యూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, విఆర్‌ఎ, విఆర్‌ఒలకు ఇచ్చిన హామీల అమలు తీరుపై శనివారం హైదరాబాద్‌లోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి లోకేష్ కుమార్‌తో కలిసి రెవెన్యూ సంఘాలతో సమావేశమై సుదీర్ఘంగా చర్చించారు. ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు పాత రెవెన్యూ వ్యవస్థను తీసుకొస్తున్నామని తెలిపారు. అందులో బాగంగానే భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చామని చెప్పారు.

"భూ భారతి ఫలితాలు ప్రతి పేదవాడికి చేరేలా చట్టం అమలుకు క్షేత్రస్థాయిలో పనిచేయండి. పదవులు శాశ్వతం కాదు, తీసుకున్న సంస్కరణలు విధాన పరమైన నిర్ణయాలు పదిమందికి మేలు జరిగేలా ఉండాలి." అని పొంగులేటి అన్నారు. అ క్రమంలో తెలంగాణ రెవెన్యూ ఉద్యోగులు నిబద్ధతతో పని చేసి ప్రభుత్వానికి పేరు తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ డిప్యూటీ కలెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. రాములు, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బి. రామ్‌రెడ్డి,వి. భిక్షం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ జెఎసి హర్షం

విఆర్‌ఎ, విఆఒలకు జిపిఒలుగా అవకాశం కల్పించేందుకు మరోసారి అర్హత పరీక్ష నిర్వహించనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించం పట్ల తెలంగాణ ఉద్యోగ జెఎసి హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు జెఎసి చైర్మన్ వి.లచ్చిరెడ్డి శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.

మంత్రితో జరిగిన రెవెన్యూ ఉద్యోగ సంఘాల సమావేశంలో క్షేత్ర స్థాయిలో ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించినట్టు తెలిపారు. జిపిఒలకు ప్రతి రెవెన్యూ గ్రామంలో కార్యాలయ స్థలం కేటాయింపు, జూనియర్ అసిస్టెంట్ల నుండి నాయబ్ తహశీల్దార్ వరకు అన్ని స్థాయిల ఉద్యోగుల జాబ్ చార్ట్ రూపొందించాలని కోరినట్టు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి మంత్రి సానుకూలంగా స్పందించినట్టు తెలిపారు.

ఆయుష్ మెడికల్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల ఎంపిక

- మెరిట్ జాబితాను విడుదల చేసిన మెడికల్ బోర్డు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వైద్యారోగ్యశాఖలో మరో నియామక ప్రక్రియ తుది అంకానికి చేరుకుంది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్, ఎంఎన్‌జె హాస్పిటల్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించిన సెలక్షన్ లిస్ట్‌ను రాష్ట్ర వైద్యారోగ్య సేవల నియామక మండలి (మెడికల్ బోర్డు) శనివారం విడుదల చేసింది. ఆయుష్ మెడికల్ ఆఫీసర్ పోస్టులు 156 ఉండగా, ఎంఎన్‌జెలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు 45 ఉన్నాయి. ఈ పోస్టుల భర్తీతో ఆయుష్ వైద్య సేవలు మరింత మెరుగవుతాయని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఆయుష్ వైద్య సేవలను బలోపేతం చేసేందుకు తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా మంత్రి గుర్తుచేశారు. ఆయుష్‌లో ఇటీవలే సుమారు 630 మంది యోగా ఇన్‌స్ట్రక్టర్లను నియమించామనీ, మరో 200లకు పైగా పోస్టులకు నోటిఫికేషన్లు ఇచ్చామన్నారు. క్యాన్సర్ రోగులు పెరుగుతున్న నేపథ్యంలో కొత్తగా 45 మంది డాక్టర్ల నియామకంతో ఎంఎన్‌జే కేన్సర్ హాస్పిటల్‌లో వైద్య సేవలు మరింత మెరుగు పడతాయని తెలిపారు. కొత్త జిల్లాలకు ఒకటి చొప్పున క్యాన్సర్ కేర్ సెంటర్లను, ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రీజినల్ క్యాన్సర్ కేర్ సెంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్టు చెప్పారు. ఈ సెంటర్లు అందుబాటులోకి వచ్చాక, పేషెంట్లు హైదరాబాద్ వరకూ రావాల్సిన అవసరం ఉండదనీ, జిల్లా స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందుతాయని వెల్లడించారు.




కొత్త దుస్తుల్లో మహిళా స్వాట్ బృందం

- బందోబస్తుల్లో స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్స్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో మొట్టమొదటిసారిగా 'స్విఫ్ట్ ఉమెన్ యాక్షన్ టీమ్' (ఎస్‌డబ్ల్యూఏటీ)ని రంగంలోకి దించారు. నగర సిపి డిజి సివి ఆనంద్ ప్రత్యేక చొరవతో ఈ బృందాలను ఎంపిక చేశారు. ఈ బృందంలో 35 మంది మహిళా పోలీసులు ఉన్నారు. వీరు ప్రధానంగా నగరంలో జరిగే ధర్నాలు, ర్యాలీలు, సభలు సమావేశాల సందర్భంగా బందోబస్తులో పాల్గొంటారు. అక్కడ మహిళా నిరసనకారులను సమర్థవంతంగా నివారించడం, వారిని అక్కడి నుంచి తరలించడం చేస్తారు. అంతేకాకుండా నగరంలో జరిగే పండుగలు, ముఖ్యమైన కార్యక్రమాల బందోబస్తులో కూడా పాల్గొంటారు. జూన్ 3న ఎస్‌డబ్ల్యూఏటీని ఏర్పాటు చేశారు. ప్రత్యేక శిక్షణ అనంతరం శనివారం వారికి కొత్త యూనిఫామ్ అందించారు. మొదటిసారిగా ఈ బృందాలు రాష్ట్ర సచివాలయం వద్ద విధుల్లో పాల్గొన్నాయి.



పల్లాకు మాజీ ఎంపి మిడియం బాబూరావు పరామర్శ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మాజీ ఎంపి మిడియం బాబూరావు శనివారం పరామర్శించారు. కెసిఆర్ ఫాంహౌస్‌లో రాజేశ్వర్‌రెడ్డి గాయపడిన విషయం తెలిసిందే. ఇటీవల ఆయనకు సోమాజిగూడ యశోద ఆస్పత్రిలో సర్జరీ అయ్యింది. రాజేశ్వర్‌రెడ్డి ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. రాజేశ్వర్‌రెడ్డిని పరామర్శించిన వారిలో తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, ఎస్‌ఆర్ శంకరన్ ఐఏఎస్ అకాడమి ఏవో సతీశ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయండి

- టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులపై మంత్రి దామోదర

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న మూడు టిమ్స్ ఆస్పత్రులతో పాటు వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేయాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఉన్నతాధికారులను ఆదేశించారు. శనివారం హైదరాబాద్‌లో ఆయన సనత్ నగర్, అల్వాల్, కొత్తపేట టిమ్స్ హాస్పిటల్స్, వరంగల్ మల్టీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణ పనులపై సమీక్షించారు. ఈ ఏడాది చివరికల్లా హాస్పిటళ్లను ప్రారంభించాలని సిఎం రేవంత్‌రెడ్డి సూచించిన సంగతి తెలిసిందే. ఆస్పత్రిలో సివిల్ వర్క్స్, ఎక్విప్‌మెంట్, డాక్టర్లు, సిబ్బంది నియామకం తదితర అంశాలపై అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. పనులను పూర్తి చేసేందుకు ఒక టైమ్‌లైన్ పెట్టుకోవాలని మంత్రి సూచించారు. హాస్పిటళ్లు ప్రారంభించిన రోజు నుంచే వైద్య సేవలు అందుబాటులోకి రావాలని అధికారులను ఆదేశించారు. ఈ నాలుగు ఆస్పత్రుల కోసం అధునాతన ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేయాలని సూచించారు. ఎక్విప్‌మెంట్ కొనుగోలులో సంబంధిత డాక్టర్లు, టెక్నికల్ ఎక్స్‌పర్టుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. ఈ సమావేశంలో ఆరోగ్యశాఖ, ఆర్అండ్‌బి శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సాయాన్ని అందజేస్తున్న చుక్కరాములు

సిగాచి బాధితులకు సిఐటియు ఆర్థిక భరోసా

- 11 కుటుంబాలకు రూ.5 వేల చొప్పున సాయం
- రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిగాచి పరిశ్రమ ప్రమాద బాధిత కుటుంబాలకు సిఐటియు సంగారెడ్డి జిల్లా అనుబంధ యూనియన్లు ఆర్థిక సహాయం అందజేసి మేమున్నామంటూ భరోసా కల్పించాయి. ప్రమాదం తర్వాత ఆచూకీ తెలియని 11 మంది కార్మికుల కుటుంబీకులు 'మా వారి ఆచూకీ ఎక్కడ?' అంటూ పరిశ్రమ ఎదుట ఎదురు చూస్తున్నారు. కనీసం చేతి ఖర్చులకు కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నందున సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు సారథ్యంలో వివిధ పరిశ్రమల యూనియన్స్ సహకారంతో ఒక్కో కుటుంబానికి రూ.ఐదు వేల చొప్పున సహాయం అందజేశారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం ఐలా భవన్ వద్ద బాధిత కార్మికుల కుటుంబ సభ్యులను వారు శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే సదుద్దేశంతో సిఐటియు యూనియన్.. శాండ్విక్ పరిశ్రమ నుంచి రూ.20 వేలు, తోషిబా పరిశ్రమ యూనియన్ నుంచి రూ.15 వేలు, సిబిఎల్ పరిశ్రమ యూనియన్ నుంచి రూ.10 వేలు, కిర్బీ పరిశ్రమ యూనియన్ నుంచి రూ.10 వేల చొప్పున మొత్తం రూ.55,000 ఆర్థిక సహాయాన్ని కార్మికుల కుటుంబాలకు అందించామన్నారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమల్లో డయ్యర్లు, రియాక్టర్లు పేలిన ప్రమాదాల్లో కార్మికులు బలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.